విద్యానామ నరస్య రూప మధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం.
విద్యా భోగకరీ యశస్సుఖ కరీ విద్యా గురూణాం గురుః
విద్యా బన్ధు జనో విదేశగమనే విద్యాపరా దేవతా
విద్యా రాజ సు పూజ్యతే నహి ధనం విద్యా విహీనః పశుః.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

విద్యయే మానవునకు సౌందర్యము. విద్యయే మానవునకు గుప్త ధనము. మానవునకు కీర్తి సుఖ భోగముల నందించునది విద్యయే. విద్య గురువునకు గురువు. విదేశములు వెళ్లినప్పుడు మానవునకు ఒక బంధువు వంటిది విద్య. విద్య మరొక నేత్రము. రాజులచే పూజింపబడునది కూడను విద్యయే ధనము కాదు. ఇట్టి పవిత్రమైన విద్యయ లేకుండిన వింత పశువనే చెప్పవచ్చును.

గుణార్జనకే గాని ధనార్జనకు కాదు:

విద్య మానవునకు కేవలము విజ్ఞానమును మాత్రమే అందించునది కాదు. భౌతిక జ్ఞానమే అందించుట విద్యయొక్క లక్ష్యమైన యిది ప్రపంచ ప్రగతిని వమ్ము చేస్తుంది. భౌతిక జ్ఞానముతో బాటు శీలము, వినయము, విధేయతను కూడా అందుకోవాలి. ఇలాంటి పవిత్రమైన విద్య తత్వాన్ని ప్రతివ్యక్తి గుర్తించటం అత్యవసరం. ఈ నాటి విద్యార్థి కలిమిని, బలమును, చెలిమిని ఆశిస్తున్నాడే గాని గుణమునకు ఏమాత్రము ప్రయత్నము చేయుటం లేదు. గుణార్జన నిమిత్తమే యేర్పడినది విద్యగాని ధనార్జన నిమిత్తము కాదు. ఈ సత్యాన్ని ప్రతి విద్యార్థి గుర్తించి వర్తించాలి. మెదడుకు విషయమును అందించటము మాత్రమే విద్యయొక్క లక్ష్యము కాదు. హృదయాన్ని పవిత్రము గావించుకోవాలి.

ఇట్టి పవిత్రమైన విద్యాతత్వాన్ని యీనాడు మానవుడు మరచిపోయాడు. ఆలోచించగలిగిన ప్రతిమానవుని అయోమయస్థితిలో ముంచెత్తే సమస్యలు యీనాడు విద్యావిధానములో విరివిగా పెరిగినవి. జీవితమునకు సంబంధించిన ప్రతిరంగములో పునీతముగను, ప్రయోజనవంతముగను తీర్చిదిద్దవలసిన, పరులకు అందించవలసిన విద్యాసంస్థలు యీనాడు విపరీత మార్గమును అనుభవిస్తున్నవి. విద్యారంగములో వుండవలసిన ప్రధానమైన క్రమశిక్షణ తరిగిపోయినది. విద్యాక్షేత్రమందు విధిగా వుండవలసిన దివ్యమైన భావములు

క్షీణించి పోయినవి. గౌరవ మర్యాదలు మంటగలసినవి. అనాలోచితముగా విద్యావిధానములో విత్తమే పునాదిగా మారిపోయినది. అనగా సరస్వతీ పర్ణశాలలైన విద్యామందిరములందు లక్ష్మి వచ్చి తిష్ఠ వేసుకున్నది. హృదయముతో అందుకొనవలసిన విద్యను ఈనాడు ధనముతో అందుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఇది సమాజమునకే ప్రమాదము. భావి భారతోద్ధారకులు గావలసిన విద్యార్థులందు ఈ పవిత్రమైన భావములు వుండినప్పుడే దేశము యొక్క కళ్యాణము, మానవుని యొక్క విశిష్టతను అభివృద్ధిగావించినవాడౌతాడు. ప్రధానమైన తత్వాన్ని ఈ లక్ష్యమును చక్కగా గుర్తించుకున్నప్పుడే దేశము బాగుపడుతుంది.

కొద్ది నిముషములకు పూర్వము ప్రెసిడెంటుగారైన వెంకట్రామన్ సత్యధర్మశాంతి ప్రేమ అహింసల యొక్క తత్వాన్ని చక్కగా వివరించారు. ఈ పంచపదములు మానవునకు పంచప్రాణములు. పంచప్రాణములే కాదు పంచకోశములు. పంచకోశములే కాదు. పంచభూతములు. ఇవి లేకుండిన మానవత్వమే నిర్మూలమైపోతుంది.

సత్యధర్మ ప్రేమ శాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చిన విలువసున్న
సత్యధర్మ ప్రేమ శాంతులు లేకున్న
దానధర్మాల సార్థకత సున్న.
సత్యధర్మ ప్రేమ శాంతులు లేకున్న
పదవుల నేలిన ఫలము సున్న
సత్యధర్మ ప్రేమ శాంతులు లేకున్న
బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మ వాక్యంబు నిలుప
గుణము విద్యకు నెల్ల పునాది గాదలప
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!
నేటి విద్యార్థి ఘనముగ నేర్వదగిన
కలవు నవరత్న రాసులో కలియుగాన
త్యాగ భావంబు వినయంబు సంఘసేవ.

మైత్రి క్రమశిక్ష సత్య నిరతియు ప్రేమ
సత్యమహింస దివ్యమా సరణియందు
ఇట్టి నవరత్న మాభరణమును సేయు
బాలబాలికల్ భరత సౌభాగ్య ఘనులు.

విద్యార్థులారా! పవిత్రమైన కలసంపదయు మానవత్వములో కనుండిన విద్యలన్నియు నిరుపయోగములే.

చదివి వ్రాయ నేర్చినవారందరు విద్యావంతులేనా
కాలేజి డిగ్రీలు పొందిన విద్యావంతులగునా
సుజ్ఞానము సుగుణములు లేని విద్యలు సద్విద్యలగునా
బ్రతుకుటకే విద్యలన్న బ్రతుక లేదె పశుపక్షులు.

కాదు. కాదు. విద్య వ్యక్తిత్వాన్ని పోషించి దివ్యత్వాన్ని వికసింప జేసి మానవత్వాన్ని రాణింప చేస్తుంది. ఈనాటి భౌతిక విద్యలన్ని కేవలము లౌకిక జీవనమును ఆధారముగా చేసుకొనుచున్నవే గాని భౌతికమునకు ఏమాత్రము ఆనందము లందించి నప్పటికిని తదుపరి దివ్య జీవితమునకు కూడను ఆదర్శమును కోరాలి.

విద్య యందు రెండు ప్రధానమైన గుణములు కలవు. ఒకటి విషయాన్ని వివరించి చెప్పటము. రెండవది జీవిత వ్యక్తిత్వాన్ని వికసింప చేయటము. ఒకటి matter రెండవది energy. ఈ పదార్థ శక్తుల యొక్క సమ్మిళిత స్వరూపమే విద్య. ఆధ్యాత్మిక, భౌతికముల సమ్మిళిత స్వరూపమే విద్య. కేవలము తలకు మాత్రమే అందించటము విద్యకాదు. హృదయాన్ని కదిలించి కరిగించే ప్రేమతత్వాన్ని బోధించాలి. మానవుని మానవునిగా మార్చినంత మాత్రమున చాలదు. ఆదర్శమానవునిగా రూపొందించాలి. దయావంతునిగా రూపొందింప జేయాలి. మానవత్వములో వున్న వ్యక్తిత్వాన్ని విద్యద్వారా వికసింప జేసి ప్రకటింప జేయటానికి తగిన ప్రయత్నము చేయాలి. మానవుడు కేవలము సత్యశోధకుడుగా నిల్చిపోవాలి. విద్యార్థి తాను ఆశించిన సత్యాన్ని భావి సాంఘిక జీవితమునందు రాణింప జేసుకోవాలి. విద్యార్థి సమస్యల యందు పౌరులు స్పందింప వచ్చు నేగాని పౌరుల యొక్క సమస్యలందు విద్యార్థులు స్పందింప రాదు. విద్యార్థులు దేశము యొక్క సౌభాగ్యమును, దేశము యొక్క క్షేమమును, దేశము యొక్క ఆనందాన్ని ఆశించుటకు ప్రయత్నించాలి.

నిస్వార్థము, నిరాడంబరము, నిరహంకారము, ప్రేమ యీనిల్గింటి యొక్క స్వరూపమే

విద్యార్థి యొక్క స్వరూపము. విద్యార్థుల యొక్క జీవితము వికాసవంతమైనదై ప్రకాశముగా ప్రపంచమునకు ప్రకటింప జేయాలి. విద్య అనగా ప్రకాశమే. ఇట్టి ప్రకాశమును ప్రపంచమునకు అందించటానికే విద్యార్థులుగా తయారు కావాలి. విద్యార్థులు విద్యానందమును అనుభవించాలి గాని విషయానందమునకు ప్రయత్నించరాదు. విద్యార్థి మాస్టర్. మాస్టరు అనగా ఏమిటి? ఇంద్రియములను అదుపులో వుంచుకున్నవాడే మాస్టరు. నీవు గృహస్థుగా మారిన తరువాత మిస్టరు అవుతావు. మిస్టర్ అనగా యింద్రియములకు లోబడినటువంటి వాడు. ఇంద్రియములను స్వాధీనము గావించుకున్నవాడే master. కనుక మొట్టమొదట విద్యార్థి యీ యింద్రియములను అదుపులో వుంచుకొనుటకు ప్రయత్నించాలి. మానవుడు గొప్ప వేదాంతి కావచ్చును. మానవుడు కేవలము అనేక పరిశోధనలు చేయవచ్చును. గొప్ప సిద్ధాంతములను వెలిబుచ్చవచ్చును. కాని తాను మానవునిగా ఏమి విలువను సంపాయించుకున్నాడు-అనే విషయమును తాను సత్తించటానికి ప్రయత్నించాలి. మానవతా విలువలే లేకుండిన ఎన్ని పరిశోధనలు చేసినప్పటికిని, ఎన్ని సిద్ధాంతములు అనుభవించినప్పటికిని యివి ప్రయోజనము లేనటువంటివి.

ఈనాటి విద్యావిధానము భారతదేశమందే కాక అన్ని దేశములందు కూడను ఒక వికృతి స్వరూపాన్ని ధరించినది. దీనికి కారణము ఎవరు అని ప్రశ్న వేసుకుంటె ఒకరు అని లేదు. యిక్కడ. తల్లి తండ్రులు విద్యార్థులను సరియైన మార్గములో ప్రవేశపెట్ట లేకపోతున్నారు. దేశనాయకులు వీరికి సరైన ఆదర్శము నందించలేక పోతున్నారు. అధ్యాపకులు కూడను వీరికి సరియైన బోధలు చేయలేక పోతున్నారు. ఆదర్శవంతమైన తల్లి తండ్రులు, ఆదర్శవంతమైన అధ్యాపకులు, ఆదర్శవంతమైన నాయకులు వుండినప్పుడు విద్యార్థి విద్యార్థిగనే వుంటాడు. కాని నిశ్చల, నిస్వార్థ నిర్మల స్వరూపులైన విద్యార్థుల హృదయములో అశాంతిని ఆవేదనను ఆవేశము నింపి యీ రాజకీయములలో ప్రవేశపెట్టి విద్యార్థుల హృదయమును మాలిన్యపరచుచున్నారు. కనుక విద్యార్థులు యీ రాజకీయములలో యేమాత్రము ప్రవేశించ కూడదు. మీ విద్య నభ్యసించిన తరువాత మీరు ఏదైనా ఉద్యోగమునందో యింకే విధమైన వృత్తులందో చేరిన తరువాత రాజకీయములలో ప్రవేశించినా తప్పు లేదు. దేశక్షేమ నిమిత్తమై, దేశభద్రత నిమిత్తమై, దేశకళ్యాణ నిమిత్తమై నీవు రాజకీయములలో ప్రవేశించి సరియైన మార్గములో నీవు ప్రవేశించు. ఈనాటి విద్యార్థులకు మంచి ఏమిటో చెడ్డ ఏమిటో సత్తించుకోలేని శక్తి సామర్థ్యములు లేకపోతున్నాయి. అధికారులు చూస్తె విద్యావిధానము పెరుగుతున్నదని వారు భావిస్తున్నారు. విద్యాసంస్థలు విరివిగా స్థాపిస్తున్నారు. విద్యార్థులు విద్యాలయములకు వెళ్లినట్లుగా కనిపిస్తున్నారు. కాని విద్యను పొందుతున్నారా లేదా అనే విషయ

522119005

మాను ఎవరూ గమనించటం లేదు. ఈ విద్యావిధానమునందు కేవలము విద్యాసంస్థలను అభివృద్ధి పరచినంత మాత్రమున చాలదు. ఈ విద్యయొక్క quality ని మనము చూడాలి. Standard ను మనం పెంచాలి. ఈ Standard యింత పతనమై పోటానికి కారణం ఏమిటి? దీనికి అనేక కారణాలున్నాయి.

విద్యను ఒక ప్రత్యేకమైన సంస్థగా ఏర్పరచినప్పుడే యీ విధమైన శక్తిసామర్థ్యములు మనము అభివృద్ధి గావించ వచ్చు. రాష్ట్రమునందుగాని లేక కేంద్రమునందుగాని విద్యామంత్రులు మారినప్పుడు యీ విద్యావిధానము మారిపోతున్నది. ఈ విధముగా క్షణాక్షణము మారటుంచే ఆ విద్యావిధానమనేది కేవలము పతనమై పోతున్నది. మంత్రులు మారినా వ్యక్తులు మారినా విద్యమాత్రము స్వస్వరూపకముగా నిల్వాలి. కనుక విద్యను ఒక ప్రత్యేకమైన సంస్థగా యేర్పరచి యిందులో గొప్ప అనుభవము వుండినవారు, గొప్ప విద్యావంతులైనవారితో ఒక కేంద్రముగా నియమించుటచూ అత్యవసరము.

అట్లు కాకుండా విద్యాసంస్థలు ఎన్ని లేవ స్థాపించినప్పటికిని ధనవ్యయమేగాని దీని వలన యే మాత్రము ఫలితము అందుకోలేరు.

మంచి గమనించు పద్ధతి మరుగు పడియె
నిలువ నీడయె లేకుండె నీతికెచట
ఇదియె ప్రోగ్రెస్సు ఈ నాడు విద్యయందు.
నీతి నియమాలు గ్రంథాన నిలచి పోయె
హృదయ మంతను మాలిన్య సదన మయ్యె
చేతలంతయు స్వార్థంపు చేతలయ్యె
ఇదియె ప్రోగ్రెస్సు ఈ నాడు విద్యలందు.
మేలు చేసిన వానికే కీడు సేయు
కూడు పెట్టిన వానికే కూలద్రోయు
విద్య నేర్పిన వానినే వెక్కిరించు
ఇదియె ప్రోగ్రెస్సు ఈ నాడు విద్యలందు.

ఏమిటి యీ విద్యయొక్క ప్రోగ్రెస్సు. ఎవరు కూడను యీ ప్రోగ్రెస్సు అంటే ఏమిటో తెలుసుకోటానికి ప్రయత్నించటం లేదు. కోట్లకోట్ల ధనాన్ని వ్యయము చేస్తున్నారు. కాని ఆ ధనమునకు తగిన ఫలితమును మనము అందుకోలేక పోతున్నాము, దేశము ఏ రీతిగా బాగుపడుతుంది. సమస్తము కూడను విద్యార్థుల యొక్క భవిష్యత్తు పైన ఆధారపడి వుంది. విద్య ఒక పాఠశాలకు

మాత్రమే పరిమితమైనది కాదు. సర్వత్ర సర్వకాలములందు వుండేది విద్య. కార్మిక కర్షక వ్యాపారము అందు కూడను విద్య అత్యవసరము. జీవితము వుండినంత వరకు నేర్చవలసిన విషయములు ఎన్నియో వున్నవి. కనుక విద్యాలయములందు చేరినంత మాత్రమున విద్యార్థులని భావించరాదు. ఎన్ని నేర్చినప్పటికిని తనను తాను గుర్తించుకోలేని అవ్యక్తము మానవుని యందుండినప్పుడు ఇవన్నీ వ్యర్థమే అయిపోతాయి.

విద్యార్థులారా! మీయందరి పవిత్రమైన భావములు అభివృద్ధి పరచుకొనుటకు తగిన కృషి చేయండి. తోటి మానవునకు ఎట్టి ఇబ్బంది కలుగకుండా చూచుకోవాలి. కనుక తల్లిదండ్రులకు తగిన సంతోషము నందించాలి. ముఖ్యముగా విద్యార్థులయందు కృతజ్ఞత అత్యవసరము. మొట్టమొదట తల్లితండ్రులకు కృతజ్ఞత చూపించాలి. మాతృదేవో భవ, పితృదేవో భవ అని మీరు వర్ణిస్తున్నారు. ఈ మాతాపితరులను ఎందుకు మనము గౌరవించాలి. ఎందుకు వారికి కృతజ్ఞతను చూపాలి. ఎందుకు వారిని ప్రేమించాలి అని విచారణ చేసుకుంటే నీ దేహములో వుండిన blood నీ headలో వుండిన తెలివితేటలు, నీవు భుజించేటి food నీవు అనుభవించేటి దుడ్డు నీ blood, నీ head, నీ food నీ దుడ్డు parents' gift. ఈ నాల్గింటిని పొందిన నీవు తగినంత కృతజ్ఞత నందించలేనివాడు ఇంక ఎవరికి నీవు అందించగలవు. వారికి నీవు కృతజ్ఞత నందించినప్పుడే మాతృదేవో భవ, పితృదేవో భవ అని పలికిన సార్థకమవుతుంది. ఆచరణ లేని పలుకులు పలికిన ప్రయోజనము ఏమిటి? ఏనాడు గృహమునందు శాంతిని నీవు అనుభవిస్తావో, ఏనాడు గృహము నందున్న వ్యక్తులను ప్రేమిస్తావో ఆనాడే ఆయింటి యందు శాంతి ఏర్పడుతుంది. ఇంటియందు శాంతి లేకుండా బయట శాంతి కోరుకోటం ఎంత వెర్రితనము. ప్రతిమానవుడు శాంతి శాంతి శాంతి నిమిత్తమై అనేక సమావేశములు జరుపుతున్నాడు.

హస్తమున అణుబాంబువుంచుక
అరచుచుందురు శాంతి శాంతి యని
చంద్రు చేరగల్గి కూడను
చెందజాలరు శాంతి సుఖములు.

శాంతి నీయందు వున్నదిగాని చంద్రుని యందున్నదా? లక్షల మైళ్లు అంతరిక్షయానము చేసేకంటె అరఇంచి హృదయాంతరాళమునకు వెళ్లుటకు నీవు ప్రయత్నించు.

విద్యార్థులారా! మీ జీవితము చాలా పవిత్రమైనది. మీ వయస్సు అంతకంటె పవిత్రమై

నది; ఒక్క కార్యమును సాధించినంతనే తృప్తి చెందే స్వభావము కాదు మానవునిది. ఇంకా ఎన్నెన్నో సాధించాలని వుల్లాసపడుతూ వుంటాడు వ్యక్తి. యవ్వనము క్షణికమైనది. అందులోను మానవుని యొక్క యవ్వనము మరింత శీఘ్రముగా కదలిపోయేటువంటిది. ఈ యవ్వనము మధ్యలో వచ్చి మధ్యలో పోయేటువంటిది. ఇలాంటి అనిత్యమైన యవ్వనమును ఆధారము చేసుకొని నీవు గర్వాన్ని అభివృద్ధి పరచుకోటం సరియైన లక్షణము కాదు. సంఘములోని పెద్దలను ఇంటిలోని తల్లి తండ్రులను గౌరవించి సరియైన స్థితిగా నీవు వున్నప్పుడే నీ గౌరవము సమాజము కూడా చూస్తుంది. విద్యార్థులారా! గౌరవ మర్యాదలనేవి one way traffic కాదు. ఇచ్చి పుచ్చుకొనేది. నీవు ఇచ్చి నీవు పుచ్చుకొనుటకు ప్రయత్నించు. కాని యీనాటి విద్యార్థులు పుచ్చుకొనుటకు సిద్ధముగా వున్నారుగాని ఇచ్చుకొనుటకు ఏమాత్రము సిద్ధముగా లేరు. కనుక ప్రతి విద్యార్థి కూడను వినయ విధేయతలను పెంచుకోవాలి. మానవత్వాన్ని తెలుసుకోవాలి. దేశము యొక్క పరిస్థితిని కూడను అర్థము చేసుకోవాలి. మన దేశము ఆశించే వ్యక్తిత్వమును మనము అభివృద్ధి పరచుకోవాలి. దేశము ఎలాంటిదైనను మన మాతృదేశము. మాతృదేశమును ప్రేమించలేని వ్యక్తి విదేశములపైన ఆశను చూపుతున్నాడంటే యిది వెఱ్ఱితనమే. ఈనాటి విద్యార్థులలో యిది ఒక పెద్ద బలహీనత యేర్పడిపోయింది. ప్రతి విద్యార్థి ఒక డాక్టరైనా లేక ఇంజనీరు అయినా యింకే విధమైన వాడైనా శ్రేష్ఠమైన లక్షణము విదేశములకు application వేసుకుంటాడు. నీ మాతృదేశములో సేవ చేయి. నీ మాతృదేశములో నీవు గౌరవమును పెంచుకో. నీ మాతృదేశమును విశ్వసించు. మాతృదేశమునే విశ్వసించలేనివాడు యితర దేశములను యేరీతిగా విశ్వసించగలడు. హృదయాన్ని పట్టుకొని నా మాతృదేశమునకు నేను సర్వస్వము త్యాగము చెయ్యాలి అనే ప్రతిజ్ఞ పూనాలి విద్యార్థులు.

విదేశ వ్యామోహం. అగౌరవం.

ఏదో బయటకు వెళ్ళి గొప్పగొప్ప విద్యలు ఆర్జించి వస్తామని భావిస్తారు. అక్కడ పోయి ఆర్జించి వచ్చేవి లేరు. తల్లి తండ్రులనే మరచిపోతున్నారు. అలాంటి కృతఘ్నులు బయటకు పోయి విద్య నభ్యసించినందువలన ప్రయోజనం ఏమిటి? ఇది కేవలము విద్యార్థుల యొక్క దోషము మాత్రమే కాదు. ప్రభుత్వము యొక్క తప్పు కూడను. మన విద్యార్థులను విదేశములకు పంపి దేశము యొక్క గౌరవము పాడు చేసుకుంటున్నాము. అవే భావములో పల విద్యార్థులకు poison point లను చాలా వరకు తగ్గించటానికి ప్రయత్నించాలి. నీవు చదివే చదువులు భారతదేశములో లేవా? ఈ సైన్సు టెక్నాలజీ మన భారతదేశములో లేవా? బయటకు పోయి చదువు నేర్చుకొని వస్తున్నామంటున్నారు. అవినయము, అవిశ్వాసము నేర్చుకొని వస్తున్నారు. ఆడంబరము మరింత నేర్చుకొని వస్తున్నారు.

రాములు చెప్పారు. నా స్వదేశము నాకు పరమ ప్రీతికరమైనటువంటిది. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నాడు. నా తల్లి కురూపిగా వున్నదని ఎవరో తల్లి అందముగా వున్నదని ఆమెను తల్లి అని పిల్చటానికి వీలవుతుందా? కురూపి అయినప్పటికిని నా తల్లి తల్లియే. సిరి సంపదలతో కళకళలాడుతున్నాయని మనం విదేశాల మీద తల్లి భావం పెట్టుకోటం కేవలము కృత్రిమమైన భావమే.

ఇది నాదు మాతృదేశము
ఇది నా మాతృభాష ఇది నా మత..మం
చెడగొట్టి నుడువనేరక
బ్రతికిన పేనుగా కండు వసుధన్ కలడా!

కాదు. కాదు విద్యార్థులారా! భారత దేశము యొక్క విశిష్టతను మీరు గుర్తించాలి. ఏ మతమును మీరు విమర్శించ నక్కరలేదు. నా దేశమును నేను విశ్వసించుకో. నా దేశమునకు నేను త్యాగము చేయాలి. నా దేశమును నేను పోషించుకో. ఈ నాటి విద్యార్థులందు దేశాభిమానము శూన్యమై పోయింది. దేహాభిమానము పెరిగిపోయింది. దేశము, దేహము బింబ ప్రతిబింబములు. దేశము, దేహము అవినాభావ సంబంధములు. అన్యోన్య ఆశ్రయములు. ఇలాంటి పవిత్రమైన ఏకత్వమును మనము విస్మరిస్తున్నాము.

భారతీయ సంస్కృతి విశిష్టం:-

అనేకత్వములో వుండిన ఏకత్వమును బోధించేదే భారతదేశము. కనుక మానవుడైనవాడు తన గౌరవమును దేశగౌరవమును మొట్టమొదట చూడాలి. పుట్టిన ప్రతి వ్యక్తి మొట్టమొదట గుర్తించేది తల్లిని తండ్రిని. తల్లిని తండ్రిని గుర్తించలేని వ్యక్తి యింక దేనిని గుర్తించగలడు. కనుక పుట్టిన ప్రతి వ్యక్తి తల్లి తండ్రులను గుర్తించినట్లుగా ప్రతి మానవుడు తన దేశమును, తన దేశ సంస్కృతిని మొట్టమొదట గుర్తించాలి. దేశము యొక్క సంస్కృతిని అర్థము చేసుకోవాలి. భారతీయ సంస్కృతి అత్యుత్తమమైనది. ఆదర్శవంతమైనది. ఆనందము నందించేది. ఇట్టి సంస్కృతిని మీరు గుర్తించుకొనలేక పోయినప్పుడు ఎన్ని చదివి ప్రయోజనము ఏమిటి? మీరు గ్రంథ పరిచయము గావించుకుంటున్నారేగాని మీలో ఆ గ్రంథాలు యేమాత్రము ప్రవేశింప చేసుకోలేదు. పుస్తకాలనంతా మస్తకాలలోకి చేర్చుకుంటున్నారు. మస్తకము, పుస్తకము రెండు ఒక్కటైపోతున్నాయి. ఆచరణ ఎక్కడుంటున్నది.

త్రికరణ శుద్ధి పెంచుకోవాలి:

కనుకనే మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం విద్యార్థులారా! త్రికరణ

శుద్ధిని మీరు పెంచుకోవాలి. త్రికరణ శుద్ధిలేక పోయిన వాడు మనిషే కాదు. ఆకార మానవుడే గాని సాకారుడు కాదని గుర్తించాలి. కనుక యిట్టి పవిత్రమైన నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక తత్వాన్ని బోధించే భారత దేశాన్ని మీరు విశ్వసించి దానికి తగిన కృతజ్ఞత నందించాలి. మొట్టమొదట తల్లి తండ్రులను గౌరవించండి. తల్లి తండ్రులను ప్రసన్నులను గావించుకోండి. తల్లితండ్రుల ప్రేమ కే నోచుకోలేని వారు యితరుల యొక్క ప్రేమను యే మాత్రము జీవితములో అనుభవించలేరు. ప్రేమ ప్రేమ అనేది హృదయమునుండి ఆవిర్భవించాలిగాని మాటలలో వచ్చునది కాదు. ఇట్టి ప్రేమ తత్వాన్ని మనము పెంచుకున్నప్పుడే మానవత్వము వికసిస్తుంది. విద్యార్థులారా, విద్యార్థినిలారా! మీరు ఆదర్శవంతమైన విద్యార్థులుగా రూపొందాలి. ఎక్కడికి వెళ్లినప్పటికి మన Institute యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించుకొని వర్తించాలి.

స్వార్థాన్ని త్యాగము చేయండి.

ఆదియే మీరు మన సంస్థకు అందించే కృతజ్ఞత. మేము దేనిని కోరలేదు. మీరు సరియైన ఆదర్శవంతమైన విద్యార్థులుగా రూపొందటమే మా ప్రధాన ఆశయము. అలాంటి విద్యార్థులుగా వుండినప్పుడే యిందులో చదివిగాని, ప్రపంచములో ప్రవేశించిగాని ఆదర్శాన్ని అందించిగాని ఒక సార్థకమవుతుంది. స్వార్థమును త్యాగము చేయండి. ఎక్కడికి పోయినప్పటికి స్వార్థము స్వార్థము. ఒక్కసారి వెనుకకు తిరిగి చూడండి. ఏప్రియల్ మాసము వచ్చిందంటే ప్రతి విద్యా సంస్థయందు విద్యార్థుల Results అంతా పడుతూ వుంటాయి. పేపరు అంతా యీ వ్రాసిన వారి నెంబర్లంతా వుంటాయి. కొన్ని లక్షల నంబర్లంతా వుంటాయి. నిజంగా వాటిని చూచి ఎంతో ఆనందించాలి. ఇంతమంది ప్యాసైనారని సంతోషించాలి. కానీ యితను ఆవిధంగా ఆనందించటం లేదు. ఇన్ని లక్షల నంబర్లలో నా నెంబరు ఎక్కడని చూడటానికి ప్రయత్నిస్తాడు స్వార్థముతో. మిగతావన్నీ పక్కకు నెట్టివేస్తాడు. నిజంగా యిన్ని నెంబర్లు చూచి నువ్వు ఆనందిస్తే, నీ నెంబరు తప్పక వుంటుంది అందులో. కనుక యింత స్వార్థము వుండకూడదు. convocation టైములోనో లేక మరొక టైములో ఫోటో తీసుకుంటే అన్ని బొమ్మలు బాగా వచ్చి వుంటాయి వాటిని చూడరు. నా బొమ్మ ఎట్లా వచ్చిందని చూస్తారు. ఇలాంటి స్వార్థాన్ని దూరం చేయాలి. ఏదైనా బస్సుకు మనం క్యూలో నిల్చుంటే ఎంతమంది వృద్ధులున్నారు, ఎంతమంది పేషెంట్లున్నారు అని వారికి ముందు సీటు యివ్వటానికి ప్రయత్నించాలి. లేదు. ఆ సీటు నీకే చిక్కాలని స్వార్థము. వేదాంతమునందు నకర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః. త్యాగము చెయ్యాలి. అదే నిజమైన అమృతత్వము. పరులకు మొట్టమొదట ఉపకారము చెయ్యాలి. 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం. Help ever hurt never. ఇది విద్యార్థులు గుర్తించవలసిన విషయం.

Test ఒక rest:

ఈనాడు అనేక సంస్థలయందు విద్యార్థులు విద్యనభ్యసించటానికి వెనుకంజ వేయటానికి కొన్ని కారణాలు వుంటున్నాయి. 1st నుండి 10th standard వరకు ఏమాత్రము examinations లేవు. ఇంక 10th standard exam వస్తే ఆ పిల్లలు examinations పోవటం లేదు. కారణం ఏమిటి? ఈ పదేండ్లు పుస్తకమే చూడటం లేదు. చదివినా చదవకపోయినా గాని ముందు క్లాసుకి పంపుతున్నారు. ఇంక పిల్లలకు విద్యావిషయమునందు ఆసక్తి కలగాలంటే ఏవిధంగా కలుగుతుంది? Test ఒక rest. ప్రతి విద్యార్థికి test పెట్టాలి. అందులో ప్యాసైనప్పుడే ముందుకు పోటానికి అతనికి కూడను ఉత్సాహము కలుగుతుంది. కనుక ఇలాంటి పిచ్చి పద్ధతులంతా రూపుమాపాలి. చిన్న చిన్న పిల్లలకు ఉత్సాహము ప్రోత్సాహము అందించాలి.

ప్యాస్ మార్కులు తగ్గించటం పతనానికి దారి:

ఇంక అది ఒకవైపున వుండగా మరొకవైపున నూటికి ముప్పై మార్కులు వస్తే ప్యాస్. ప్రభుత్వమే దీనికి ఒక లైసెన్సు అందించింది. ఇది చాలా తప్పు. కారణమేమనగా నూరు పనులు చెప్తే 70 పనులు చేయకపోతే వానిని ఎట్లా ప్యాస్ చేసేది? ఏదో ఒకటో రెండో తప్పులు చేస్తే క్షమించవచ్చు. 70 తప్పులు చేసి 30 బాగా చేస్తే వానిని ప్యాస్ చేయటం సరియైన పద్ధతి కాదు. అప్పుడే విద్యార్థులకు ఒక విధమైన నిరుత్సాహము బయలుదేరుతుంది. ఇంక 30 మార్కుల లోపల కూడను ఎన్నెన్నో వుంటున్నాయి. Chief minister grace marks కొన్ని, విద్యామంత్రి grace మార్కులు కొన్ని, head master grace marks కొన్ని. ఇంక చదువ నక్కరలేదు. ఇలాంటివంతా చేయటం చేతనే విద్యాసంస్థలు కేవలము పతనమైపోతున్నాయి. ఇలా ప్యాసైన విద్యార్థులు దేశమును ఏవిధముగా వృద్ధిరించగలరు. మీరు దేశనాయకులుగా రావాలి. కనుకనే అలాంటి పిల్లలయందు ఒక విధమైన ఉత్సాహ ప్రోత్సాహాన్ని అభివృద్ధిగావించి తగిన test లు పెట్టి విద్యావిధానము లోపల తగిన standard ను పెంచాలి. దేనియందైనా దయాదాక్షిణ్యాలను చూపవచ్చుగాని విద్యా విషయమునందు దయాదాక్షిణ్యము చూపకూడదు.

క్రమశిక్షణ కావాలి.

దానిపేరే శిక్షణ. శిక్షణ శిక్షణ అనగా శిక్షిస్తూ రావాలి. శిక్షణ అనగా కొట్టటం కాదు. వారి దోషాన్ని వారికి చెప్పి పవిత్రతను బోధించి మున్ముందు వారిని అభివృద్ధిగావించటానికి తగిన ఉత్సాహము నందించాలి. హితాన్ని బోధించేవాడు గురువు. హితాన్ని కలిగించేవాడు కాదు. గురుభక్తితో వుండిన వాడే నిజమైన శిష్యుడు. ఈనాటి శిష్యుడు గురువు దగ్గర విరోధిగా వుంటున్నాడు. తాను

సిగరెట్లు త్రాగటమే కాకుండా సార్ తీసుకోండి అని టీచరుకు అందిస్తున్నాడు. ప్రాచీన కాలమునందు భారతదేశము యొక్క గురుశిష్యసంబంధము ఎంత పవిత్రముగా వుండేది. ఈ ఆధునిక కాలమందు freedom. ఏమిటి ఈ freedom. freedom ఇవ్వవలసిందే. ఎంత వరకూ మాత్రమే అంత వరకు ఇవ్వాలి.

The end of wisdom is freedom.

The end of culture is perfection

The end of knowledge is love

The end of education is character

ఈ విధమైన దింట్లో మనము చక్కగా తయారు గావించాలి కాని ఏదో వారికి freedom ఇవ్వాలంటే చివరకు వారు deaf and dumb అయిపోతున్నారు. ఏమి చెప్పినా వినరు ఎవరి మాటకు జవాబు లేదు. ఈ విధముగా అహంకారవంతులై మితిమీరి పోతున్నారు.

దైవాన్ని స్మరించండి దేశాన్ని ప్రేమించండి:

ప్రేమ స్వరూపులైన విద్యార్థులారా! మీరు దేశానికి తగిన ఆదర్శము నందించాలని నేను ఆశిస్తున్నాను. డిగ్రీలు పొందటం ముఖ్యము కాదు. మీరు దీనిని ఆచరించి ఇతరులకు అందించాలి. ఇదే నిజమైన విద్యయొక్క సంబంధము. ఇదే నిజమైన విద్యయొక్క లక్ష్యము. ఈ లక్ష్యమును మీరు దృష్టియందుంచుకొని నిజాన్ని పలుకుతూ ఈ సత్యాన్ని పలుకుతున్నాము కదా యని సత్యము వల్ల మరొకరికి అపకారము జరగకుండా చూడాలి. ఈ సత్యము వలన యేవిధముగాను ఇతరులకు అపకారము జరుగకూడదు. 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం'. ప్రియము కదా యని అసత్యము చెప్పవద్దు. సత్యము కదా యని ఇతరులకు హాని చేయవద్దు. ఈ సత్యము వలన ఎవరికైనా అపకారము జరిగే పరిస్థితి యేర్పడితే అప్పుడు సత్యము వద్దు అసత్యము వద్దు. quiet గా వుండు. ఈ విధమైన యోగ్యతను మీరు సంపాయించుకోవాలి. ఏ కార్యమునందు పరులకు అపకారము కాకుండా చూచుకోవాలి. ముఖ్యముగా ఈనాటి పరిస్థితి యందు దేశాభిమానము చక్కగా పెంచుకోవాలి. దేశమునకు సేవ చెయ్యాలి. దేశము యొక్క భద్రతను మనం తీసుకోవాలి. సమాజము యొక్క అభివృద్ధిని మనము ఆశించాలి. ఈ అన్నింటికి వ్యక్తి ఒక్కడే ప్రధానము. వ్యక్తి బాగా వుండినప్పుడే ఇల్లు బాగా వుంటుంది. కుటుంబము బాగా వుండినప్పుడే గ్రామము బాగా వుంటుంది. గ్రామాలు బాగా వుండినప్పుడే జిల్లాలు బాగా వుంటాయి. జిల్లాలు బాగా వుండినప్పుడే రాష్ట్రము బాగా వుంటుంది.

కనుక రాష్ట్రము యొక్క మంచి చెడ్డలు వ్యక్తిపైన ఆధారపడి వుంటున్నాది. కనుక నీవు మంచి వాడుగా. నీ ద్వారా యితరులను మంచి వారుగా తీర్చి దిద్దు. దేశ సేవ చేయుటకు ముందంజ వేయి. ఎలాంటి పరిస్థితుల యందు వెనుకంజ వేయ వద్దు. దైవాన్ని స్మరించు. దేశాన్ని విశ్వసించు. ఆనందాన్ని అనుభవించు. అదే నిజమైన మానవుని ప్రధాన లక్ష్యము.

జాతి కులమత భేదములు లెక్క చేయకండి:

విద్యార్థులారా. ఈ నాడు మన ప్రెసిడెంటు వెంకట్రామన్ చక్కని ఆదర్శాన్ని అందిచాడు. అన్ని రాష్ట్రముల సాధుసంతల యొక్క వివరములను మనకు అందించాడు. పెద్దల యొక్క హృదయాలు చాలా పవిత్రములే. పెద్దల యొక్క వాక్యాలు శిరసావహించాలి. కేవలము విని తిరిగి పోవటమే జరుగుచున్నాది. యిలా జరగ కూడదు. ఒకటి రెండైనా మీరు ఆచరణలో పెట్టి దేశోద్ధారమునకు కంకణము కట్టుకోండి. మానవ సోదరుల యొక్క తత్వాన్ని మీరు అనుభవించండి. అందరూ ఒకటే అన్న సమత్వాన్ని భావించండి. జాతి మత కుల భేదములు ఏ మాత్రము లెక్క చేయకుండా అన్నింటిని పూర్తి ఏకత్వముగా భావించండి.

సర్వధర్మ సమభావము:

ఏ మతమును ద్వేషించ రాదు. ఈ విధమైన సమభావమును పెంచుకొనుటయే సరియైన విద్య. All are one be alike to every one. ఈ యొక్క సమత్వాన్ని మీరు పెంచుకోండి. మతములు ఎన్నైనా మార్గమొక్కటే. మానవుడు కూడను దివ్యత్వమును కలిగిన టువంటి వాడే. ఆ దివ్యత్వము నీయందు కూడ వుంటున్నాది. ఆ దివ్యత్వము సర్వత్రా వ్యాపింప చేయటానికి కృషి చెయ్యాలి. నేను అధికంగా సంభాషణ సల్పి నేను మీకు శ్రమ కలిగిస్తున్నాను. నా యొక్క ఉపన్యాసము విరమించుకుంటున్నాను. ఈ పవిత్రమైన సమయమునందు పెద్దలు వుచ్చరించినవి, పెద్దలు బోధించినవి మీ హృదయములో తిరిగి మాదిరి చేసుకొని మీరు అప్పుడప్పుడు మననము చేసుకుంటూ రావాలి. అప్పుడే యీ convocation జరిగినందుకు సరియైన అర్థము.

విద్యముగించిన తరువాత గృహస్థులు కాబోయే ముందు ప్రాచీన కాలము నందు అధ్యాపకులు విద్యార్థులను చేర్చి వారికి ఉపదేశము చేసే సమావేశమే యీ convocation. ఆనాడు స్నాతకోత్సవమని పిలిచే వారు. స్నాతకోత్సవమనగా ఏమి? ఉపదేశములు తీసుకొని ఆ ఉపదేశములు తిరిగి భవిష్యత్తులో అనుభవించటానికి తగిన కృషి చేయటమే స్నాతకోత్సవము యొక్క యదార్థము. ఏదో డిగ్రీలు తీసుకోవటము, గోల్డు మెడలు తీసుకోటము వెళ్ళిపోటం కాదు నిజమైన గోల్డు మెడల్ యీ ఉపదేశమును ఆచరణలో పెట్టినప్పుడే నీవు ఆ విధమైన ఆనందము అందింప

522119013

చేస్తుంది. నీవు అహంకారము నిర్మూలనము చేసుకో. ఆడంబరమును చంపుకో. త్రికరణ శుద్ధిని అభివృద్ధి గావించుకో. తగిన లక్ష్యాన్ని పూను. నీ కర్తవ్యమును నీవు పాటించు. Duty is God. Work is worship. ఈ రెండింటి యందు నీ లక్ష్యమును వుంచుకొని భవిష్యత్తులో పల యీ విద్యార్థులు తగిన ఆదర్శము నందించి తిరిగి భావి భారతోద్ధారకులైన వుత్తల్యాన్ని దేశానికి ఖ్యాతి గావిస్తారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ విరమిస్తున్నాను.

(1990 నవంబరు 22వ తేదీ గురువారం శ్రీసత్యసాయి హిల్ వ్యూస్టేడియంలో శాంతివేదికనుండి శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయ కాన్వొకేషన్ సందర్భముగా సామివారి దివ్యోపన్యాసం)